మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM
తెలుగు డైలీ
శనివారం , 17, అక్టోబర్, 2026
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

### జాతీయ పోలీస్ అకాడమీలో
# పాసింగ్ అవుట్ పరేడ్

**● అధికారం కంటే బాధ్యతే ముఖ్యమని తన సందేశంలో పేర్కొన్న అమిత్ షా**



**హైదరాబాద్ :**దేశ అంతర్గత భద్రతలో మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు యువ ఐపీఎస్ అధికారులు సిద్ధం కావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. అధికారాన్ని హోదాగా కాకుండా బాధ్యతగా భావించాలని, ప్రచారానికి దూరంగా ఉంటూ ఫలితాలపైనే దృష్టి సారించాలని సూచించారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ 78వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ పరేడ్‌ను సమీక్షించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా అమిత్ షా పంపిన సందేశాన్ని చదివి వినిపించారు.పాసింగ్ అవుట్ పరేడ్‌సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ 78వ బ్యాచ్‌లో భాగంగా మొత్తం 151 మంది అధికారులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో 135 మంది ఐపీఎస్ అధికారులు కాగా, మరో 16 మంది నేపాల్, భూటాన్, మాల్దీవులకు చెందిన అధికారులు కూడా శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ బ్యాచ్‌లో 37 మంది మహిళా అధికారులు ఉండటం విశేషం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ పరేడ్‌ను సమీక్షించారు. అధికారుల కవాతు, క్రమశిక్షణ, సమన్వయాన్ని పరిశీలించారు. అనంతరం శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు అందజేశారు. ఈ బ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎనిమిది మంది, తెలంగాణకు ఇద్దరు ఐపీఎస్ అధికారులను కేటాయించారు.

### తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర చంద్రబాబు ప్లాన్‌కు
# రేవంత్ సహకారం



**హైదరాబాద్ :**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు.

### పోలీస్ యూనిఫామ్‌లో డ్యాన్స్ చేస్తే
# కఠిన చర్యలు తప్పవు



**■ ప్రైవేట్, వినోద కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఆంక్షలు**
**■ సోషల్ మీడియాలో పోలీసుల డ్యాన్స్ వీడియోలు వైరల్ కావడంతో ఈ నిర్ణయం**
**■ యూనిఫామ్ గౌరవాన్ని కాపాడాలని సిబ్బందికి సీవీ ఆనంద్ సూచన**

**హైదరాబాద్ :**తెలంగాణలో పోలీస్ సిబ్బంది యూనిఫామ్‌లో డ్యాన్సులు చేయడంపై రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పంది ంచారు. ఇకపై యూనిఫామ్ ధరించి వినోద కార్యక్రమాల్లో పాల్గొన్నా, డ్యాన్సులు చేసినా కఠిన క్రమశిక్షణా చర్యలు తీసు కుంటామని ఆయన శుక్రవారం హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని పోలీస్ యూనిట్ల అధిపతులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కాలంలో పలువురు పోలీసు సిబ్బంది, అధికారులు పండుగలు, ప్రైవేట్ కార్యక్రమాల్లో యూనిఫామ్‌లోనే డ్యాన్సులు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గణేశ్ నిమజ్జనం, మేడారం జాతర, వీడ్కోలు సమావేశాలు వంటి సందర్భాల్లో జరిగిన ఈ ఘటనలు పోలీసు శాఖ క్రమశిక్షణపై ప్రజా విమర్శలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో డీజీపీ తాజా ఆదేశాలు జారీ చేశారు.పోలీస్ యూనిఫామ్ అనేది బాధ్యత, అధికారం, క్రమశిక్షణకు ప్రతీక అని, దాని గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీజీపీ నొక్కిచెప్పారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఇలాంటి చర్యలకు పాల్పడటం సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేశారు.

# ఎల్‌నినో తెచ్చిన ముప్పు

**- ఫిబ్రవరిలోనే వేసవి ప్రారంభం!**



**హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో శీతాకాలం కూడా అధిక ఉష్ణోగ్రతలతో ఎండాకాలంగా మారనుందని క్లైమేట్ ట్రెండ్స్ అధ్యయన నివేదిక వెల్లడించింది. అలాగే 1901 తర్వాత అత్యంత వేడి నెలగా 2026 ఆగస్టు రికార్డు సృష్టించింది. ఎల్?నినో ప్రభావంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఫిబ్రవరి నెలలోనే వేసవి పరిస్థితులు తలెత్తుతాయని క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ నివేదించింది.1950 తర్వాత భారతదేశానికి ప్రస్తుత ఎల్?నినో అత్యంత తీవ్రమైన ముప్పుగా పరిణమించిందని, ఇప్పటికే వర్షపాత లోటు నమోదవుతుండగా, వెచ్చని శీతాకాలంతో రబీ పంటలపై తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉందని తెలిపింది. నేలలో తేమ తగ్గడం, భూగర్భ జలాలు పడిపోవడం, రిజర్వాయర్లలో నీరు అడుగంటిపోవడం కారణంగా రాబోయే రబీ పంటలతో పాటు ఆ తర్వాత వచ్చే వేసవి పంటలకు కూడా ముప్పు వాటిల్లుతుందని పేర్కొంది. అయితే ఇప్పటికే వరి, చెరకు, పత్తి వంటి పంటల సాగులో గణనీయంగా లోటు కనిపిస్తోంది.'భారత్‌పై ఎల్‌నినో ముప్పేట ముప్పు' పేరిట క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ అధ్యయన నివేదికను శుక్రవారం విడుదల చేసింది. ఇందులో ఎల్‌నినోకు తోడుగా వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ కలిసి ఉష్ణోగ్రతలను గణనీయంగా పెంచడంతోపాటు నీటి సంక్షోభం మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది.

### బీఆర్ఎస్ ఆస్తుల చిట్టా
# రూ.1509 కోట్ల ఆస్తులు.



**హైదరాబాద్ :**పదేళ్ల పాటు తెలంగాణలో అధికారంలో ఉన్న 'భారత రాష్ట్ర సమితి' (బీఆర్ఎస్) ఆర్థిక వ్యవహారాలు ఆసక్తికరంగా మారాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పార్టీ సమర్పించిన ఆడిట్ రిపోర్ట్ ప్రకారం మొత్తం ఆస్తులు రూ.1,509 కోట్లుగా ఉండగా.. అదే ఏడాది ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువగా నమోదైంది. కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన ఈ నివేదిక, పార్టీ ఆర్థిక వనరులు, వ్యయాలపై స్పష్టమైన చిత్రాన్ని ఆవిష్కరించింది.ఆడిట్ రిపోర్ట్ ప్రకారం.. 2026 మార్చి 31 నాటికి బీఆర్ఎస్ పార్టీకి ఉన్న మొత్తం ఆస్తుల విలువ రూ.1,509 కోట్లు. ఇందులో సింహభాగం, అంటే రూ.1,431 కోట్లు బ్యాంకుల్లో నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలోనే ఉన్నాయి. వీటిలో రూ.1,237 కోట్లు ఏడాదికి పైబడిన కాలపరిమితి కలిగిన దీర్ఘకాలిక డిపాజిట్లు కావడం గమనార్హం. భవనాలు, ఇతర భౌతిక ఆస్తుల విలువ రూ.66.26 కోట్లుగా, రుణాలు, అడ్వాన్సుల రూపంలో మరో రూ.11.77 కోట్లు ఉన్నట్లు పార్టీ తన నివేదికలో వెల్లడించింది.ఇక పార్టీ ఆదాయ, వ్యయాల వివరాలను పరిశీలిస్తే, 2025-26లో బీఆర్ఎస్‌కు వివిధ మార్గాల ద్వారా రూ.114 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో విరాళాల ద్వారా రూ.16.44 కోట్లు రాగా, డిపాజిట్లపై వడ్డీ, అద్దెలు, ఇతర మార్గాల నుంచి ఏకంగా రూ.97.76 కోట్లు సమకూరాయి.

# మున్సిపల్ ఎన్నికలు.. మేయర్ అభ్యర్థులపై ఉత్కంఠ.

## సీఎం నిర్ణయంపై ఆసక్తి




**అమరావతి, అక్టోబరు 17 :**

తెలుగుదేశం పార్టీలో మేయర్, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే అభ్యర్థుల ఎంపికపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కసరత్తు చేస్తున్నారు. (శనివారం) దశల వారీగా మిగిలిన అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. 4 కార్పొరేషన్లకు మేయర్లు, 49 మున్సిపాల్టీలకు చైర్ పర్సన్‌లను తెలుగుదేశం పార్టీ ప్రకటించాల్సి ఉంది. గుంటూరు, ఒంగోలు, మచిలీపట్నం, మంగళగిరి మేయర్ అభ్యర్థులను కూడా ప్రకటించాల్సి ఉంది.ఆయా అభ్యర్థుల ఎంపికపై ఐవీఆర్ఎస్ సర్వేలు కొనసాగుతున్నాయి. ఆయా వార్డుల వారీగాను అభ్యర్థులను జిల్లా నాయకత్వం ప్రకటించాల్సి ఉంది. వార్డుల అభ్యర్థులపై జిల్లాల్లో కూటమి నేతలు ఇప్పటికే ఉమ్మడి సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నామినేషన్లకు (ఆదివారం) చివరి తేదీ కావడంతో ఈరోజులోగా పూర్తిస్థాయిలో అభ్యర్థుల జాబితాను కొలిక్కి తెచ్చే పనిలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బిజీగా ఉన్నారు.తూర్పుగోదావరి జిల్లాలో రాజకీయ వ్యూహం మొదలుపెట్టిన టీడీపీ నేతలుమున్సిపల్ ఎన్నికల నామినేషన్ వేళ తూర్పుగోదావరి జిల్లాలో తెలుగుదేశం పార్టీ నేతలు రాజకీయ వ్యూహం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే కొవ్వూరులో టీడీపీలో వైసీపీ నేతలు చేరుతున్నారు. టీడీపీ కొవ్వూరు మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా కంటమణి విజయలక్ష్మి నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారు.మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి వెనక్కు తగ్గుతున్నా వైసీపీ నేతలుమరోవైపు.. మున్సిపల్ ఎలక్షన్‌లో పోటీ చేయడానికి వైసీపీ నేతలు వెనక్కు తగ్గుతున్నారు. తొలుత ప్రకటించిన వైసీపీ కొవ్వూరు మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి మన్నే పద్మ పోటీకి దూరంగా ఉన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. పద్మను అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఆమె పోటీ చేయడానికి ఇష్టపడకపోవడంతో మరో అభ్యర్థిని నిలబెట్టడానికి రంగంలోకి వైసీపీ ముఖ్య నేతలు దిగారు. వార్డు మెంబర్లు కూడా ఈ ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. అయోమయ కొవ్వూరు నాయకులు ఉన్నారు.

### కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు
# పాత గుత్తేదారులకే ఇవ్వాలా?



**హైదరాబాద్ :**కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతుల పనులు పాత గుత్తేదారులకే ఇవ్వాలా లేక టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించాలా అన్నదానిపై నీటిపారుదల శాఖ తర్జనభర్జనలు పడుతోంది. ఓ వైపు పాత గుత్తేదారులతో చర్చలు జరుపుతున్నా, మరోవైపు మంత్రివర్గం ఎలాంటి నిర్ణయం తీసుకొంటుందో అన్న ఆందోళనలో ఉంది. మేడిగడ్డ పునరుద్ధరణతో సహా మూడు బ్యారేజీల మరమ్మతులకు సుమారు రూ.2500 కోట్లు వ్యయమయ్యే అవకాశం ఉందని మొదట తాత్కాలికంగా అంచనా వేసినా, తాజాగా ఇంకా ఎక్కువ కావొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించి డిజైన్లు, డ్రాయింగ్స్ పూర్తయితే కానీ అంచనాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. తాజా ధరలతో అంచనాలు తయారు చేయాల్సి ఉంది. బ్యారేజీల నిర్మాణ అంచనా ఖర్చులో 50-60 శాతానికి పైగా ఖర్చయ్యే పునరుద్ధరణ పనులను టెండర్? లేకుండా నామినేషన్?పై ఇస్తే వచ్చే సమస్యలను కూడా నీటిపారుదల శాఖ పరిశీలిస్తోంది. పైగా సిఫార్సుల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉన్న, ప్రభుత్వంపై కోర్టుకెళ్లిన వారికి ఇస్తే ఏమైనా ఇబ్బందులు వస్తాయా అని కూడా ఆలోచిస్తోంది. నిర్మాణం చేసిన సంస్థలకే ఇవ్వడం వల్ల అన్నింటిపై అవగాహన ఉంటుందనే అభిప్రాయాన్ని కొందరు ఇంజినీర్లు వ్యక్తం చేస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ కుంగిన ఘటనపై విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీపై క్రిమినల్ చర్యకు సిఫార్సు చేయడంతోపాటు పునరుద్ధరణకు అయ్యే ఖర్చును కూడా సంస్థే భరించాలని నివేదికలో పేర్కొంది. బ్యారేజీ మరమ్మతు ఖర్చుని నిర్మాణ సంస్థే భరించాలని, లేదంటే ప్రభుత్వం వ్యయం చేసి నిర్మాణ సంస్థ నుంచి వసూలు చేయాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా సిఫార్సు చేసింది. ఈ సంస్థకు పని పూర్తయినట్లు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతోపాటు విచారణకు ఆదేశించింది.

# అమెరికా గడ్డపై తెలంగాణ సంస్కృతి పరిమళం

- ఫ్రెస్నోలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, ఔజూహా ఫౌండర్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి





**జనగామ జిల్లా ప్రతినిధి జె.ఉపేందర్, అక్టోబర్ 17(ప్రజావాణి):** తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయ పండుగ, పూల పండుగ అయిన బతుకమ్మ వేడుకలు అమెరికా నేలపై అంగరంగ వైభవంగా జరిగాయి. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం, ఫ్రెస్నో నగరంలో ఉన్న శ్రీకృష్ణ బృందావన మందిరం (హిందూ టెంపుల్ ఆఫ్ ఫ్రెస్నో) ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) వైస్ ప్రెసిడెంట్, ప్రముఖ సామాజిక సేవకురాలు, ఔజూహా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఓ చైర్మన్ హన్మాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి విచ్చేసి, వేడుకలను ప్రారంభించారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు మహిళలు వందలాదిగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా పట్టు చీరలు, లంగా ఓణీలలో ముస్తాబై వచ్చారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలతో 7 అంతస్తుల్లో అందంగా బతుకమ్మలను పేర్చారు. అనంతరం బతుకమ్మ చుట్టూ వలయంగా చేరి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యా లో..అంటూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, కోలాటం ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. చిన్నారులు సైతం సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని అందరినీ ఆకట్టు కున్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లా డుతూ"తెలంగాణ సంస్కృతికి, మహిళా శక్తికి ప్రతీక బతుకమ్మ. మనం ఎక్కడ ఉన్నా, ఏ దేశంలో ఉన్నా మన మూలాలను మరచి పోకూడదు. అమెరికాలో ఉంటూ కూడా మన పిల్లలకు మన పండుగల గొప్పతనాన్ని తెలియజేస్తూ, ఇంత చక్కగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న ఫ్రెస్నో ఆలయ కమిటీకి, తెలుగు సంఘం సభ్యులకు నా హృదయపూర్వక అభినందనలు. ప్రవాస ప్రాంతాల్లో ఇలాంటి వేడుకలు మన తెలుగు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయి. ఔజూహా ఫౌండేషన్ తరఫున ఎల్లప్పుడూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలకు అండగా ఉంటాము" అని అన్నారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు వాటి గొప్పతనాన్ని పరిచయం చేసేలా ఇలాంటి వేడుకలను నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ వేడుకలు కేవలం పండుగ మాత్రమే కాదు, తెలుగు ప్రజల మధ్య ఐక్యతను, సాంస్కృతిక అనుబంధాన్ని చాటిచెప్పే వారధిగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో హిందూ టెంపుల్ ఆఫ్ ఫ్రెస్నో అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, ఫ్రెస్నో తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు, ఔజూహా ఫౌండేషన్ సభ్యులు, వందలాది మంది తెలుగు కుటుంబాలు పాల్గొన్నారు. చివరగా మహిళలందరికీ బతుకమ్మ ప్రసాదం, పండ్లు పంపిణీ చేశారు.

# ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు మున్నూరు కాపు సంఘం సన్మానం





**దండేపల్లి, అక్టోబర్ 17 (ప్రజావాణి):** దండేపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కుంచె ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బొడ్డు జగన్ ఎన్నికైన సందర్భంగా శనివారం దండేపల్లి మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం దండేపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేంద్ల సత్తన్న, ప్రధాన కార్యదర్శి గడిపల్లి సత్తన్న ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుంచె ప్రసాద్, ఉపాధ్యక్షుడు బొడ్డు జగన్‌లకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు బొలిశెట్టి లింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కాసాన కొట్టు లింగన్న, బొలిశెట్టి సత్తన్న (బద్రి), కొండు సత్తన్నతో పాటు మున్నూరు కాపు సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన బిచ్కుంద మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్

### పండుగ వేళ చెరువుల వద్ద, డీజే కార్యక్రమాల్లో అప్రమత్తంగా ఉండాలి



**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 17** సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బిచ్కుంద మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా యువత డీజే కార్యక్రమాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా బతుకమ్మ నిమజ్జనం చేసే చెరువుల వద్ద తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లలు నీటిలోకి దిగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలందరూ భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా ఆనందాన్ని, సంతోషాన్ని నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్ ఆకాంక్షించారు.

# పస్రా నాగారం, రాంపూర్ విభజనకు స్వస్తి పలకాలి

- ముప్వ బాను ప్రకాశ్.
- ఈగోలు వద్దు.. ఐక్యతే ముద్దు
- ఏకమవ్వాలన్న 11వ వార్డు సభ్యుడు
- రావణ వధ ఒక్కటే.. వేడుక ఒక్కటే కావాలి!
- దసరా వేడుకల్లో ఐక్యత లోపం
- గ్రామ పెద్దలు చొరవ చూపాలని డిమాండ్.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి)** గోవిందరావుపేట మండలంపస్రా నాగారం గ్రామపంచాయతీ పరిధిలో రాంపూర్ లో ప్రతి ఏటా రెండు చోట్ల రావణ వధ నిర్వహించడం సరికాదని 11వ వార్డు సభ్యుడు ముప్వ బాను ప్రకాశ్ ఆరోపించారు. ఒకే గ్రామం, ఒకే పంచాయతీ, ఒకే ప్రజానీకం ఉన్నప్పుడు వేడుకలు మాత్రం వేరు వేరుగా నిర్వహించడం వల్ల గ్రామంలో విభజన భావన పెరుగుతోందని ఆయన అన్నారు. జాతీయ రహదారి 163కు ఇరువైపులా ఉన్నామనే కారణంతో పస్రా నాగారం, రాంపూర్ అంటూ విడిపోవడం వల్ల పండుగ వైభవం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా అంటేనే చెడుపై మంచి విజయానికి ప్రతీక అని, రావణుడిని దహనం చేస్తూ మన మధ్య ఉన్న ఈగోలు, పట్టింపులను కూడా దహనం చేయాలని సూచించారు. రెండు చోట్ల వేడుకల వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొంటోందని, ఒక్కచోట ఐక్యంగా చేస్తేనే పండుగకు నిజమైన అర్థం వస్తుందని అన్నారు. ఎవరి గౌరవానికి భంగం కలగకుండా, అన్ని కుల సంఘాలు, అన్ని వర్గాలను, యువతను కలుపుకొని ఉమ్మడి వేదికపై దసరా జరపాలని డిమాండ్ చేశారు.

పండుగల్లోనే ఐక్యత చాటలేకపోతే తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం వంటి అభివృద్ధి పనుల్లో ఎలా కలిసి పనిచేస్తామని ప్రశ్నించారు. ఈ దసరా నుంచైనా విభజనకు స్వస్తి పలికి, ఒకే వేదిక, ఒకే రావణ వధ, ఒకే వేడుకగా నిర్వహించేలా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.

పస్రా నాగారం, రాంపూర్ వేరు కాదు, ఒకే కుటుంబమనే స్ఫూర్తితో ముందుకు సాగితేనే గ్రామం జిల్లాకే ఆదర్శంగా నిలుస్తుందని ముప్వ బాను ప్రకాశ్ అన్నారు.

# పోతన్‌పల్లి (ఎం)లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి





**నారాయణఖేడ్ నియోజకవర్గం:-**

**(ప్రజావాణి) ఇంచార్జ్ మదు సుదన్**

నారాయణఖేడ్ మండల పరిధిలోని పోతన్‌పల్లి (ఎం) గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ. 10 లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు శంకుస్థాపన చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వివిధ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ సౌకర్యాలు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పోతన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, గృహనిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు స్థానిక ప్రజాప్రతినిధులు, , నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కారోబార్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన ప్రవీణ్ రావు




**పెద్దవంగర అక్టోబర్ 17 ప్రజావాణి** వడ్డెకొత్తపల్లి కారోబార్ చేత పరుశరాములు తండ్రి చేత ఎల్లయ్య శుక్రవారము పరామపదించినారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు ఎల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎల్లయ్య తో తమ కుటుంబ సభ్యులకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డెకొత్తపల్లి సర్పంచ్ దంతాలపల్లి పరశు రాములు,ఉప-సర్పంచ్ ఎర్రగొర్ల రమేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తంగళ్ళపల్లి మల్లికార్జున చారి, వార్డు సభ్యులు గద్దల యాకలక్ష్మీ యాకయ్య, మాజీ వార్డు సభ్యులు దంతాలపల్లి ఎల్లయ్య, ఉపేందర్, పాక అనిల్ కుమార్, వెల్మ బీరన్న, కొమ్మనబోయిన వెంకన్న,తడకమల్ల ఐలయ్య ఉన్నారు.

# 13 కోట్ల ఓట్లను తొలగించారు.. మోదీ సర్కార్‌పై మధుయాష్కీ ఆరోపణలు



**హైదరాబాద్, అక్టోబర్ 17:** ప్రస్తుతం భారతదేశం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిలో ఉందని.. అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలని ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. 2014లో మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ రక్షణ కోసం 2017లో రాహుల్ గాంధీ ప్రొఫెషనల్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించాలంటే ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పాత్ర కీలకమని చెప్పుకొచ్చారు. ఇతర పార్టీలో ఉన్న వారు కూడా ప్రొఫెషనల్ కాంగ్రెస్‌లో భాగం పంచుకోవచ్చని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సభ్యత్వంలేని వారు కూడా రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేయొచ్చని అన్నారు. దేశంలో 'సర్'(ూ×=) ద్వారా 13 కోట్ల ఓట్లను మోదీ ప్రభుత్వం తొలగించిందని మధుయాష్కీ ఆరోపించారు. 13 కోట్ల ఓట్లలో ఎక్కువ మంది దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓట్లు ఉన్నాయన్నారు. తొలగించిన 13 కోట్ల ఓట్లు ఆధారాలతో బయటపెట్టామని అన్నారు. ూ×=పై పోరాటం కాంగ్రెస్ భవిష్యత్తు కోసం కాదని.. దేశ ప్రజల భవిషత్తు కోసమని స్పష్టం చేశారు. బీజేపీ మోదీ ప్రభుత్వం పౌరుల స్వేచ్ఛను కలరాస్తోందని విమర్శించారు. క్లిష్ట సమయంలో తనకు అప్పజెప్పిన ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. మనోహ్మన్ సింగ్ ఫెలోషిప్ ద్వారా వివిధ రంగాల్లో వచ్చిన నిష్ణాతులైన 50 మందికి ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చారని మధుయాష్కీ తెలిపారు. రెండో దఫా 800 అప్లికేషన్స్ వచ్చాయని.. 100 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. బారిస్టర్లు, లాయర్లు, డాక్టర్లతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఏర్పడిందని.. దీనితోనే స్వాతంత్ర్యం ఏర్పడిందన్నారు. భారత పౌరులకు రక్షణ కల్పించేది రాజ్యాంగమన్నారు. ప్రొఫెషనల్స్‌కు క్రెడిబులిటి ఉండాలని రాహుల్ గాంధీ ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకరావడంలో ప్రొఫెషనల్స్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల కోసం ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. ప్రజలకు, ప్రతి పౌరుడికి గౌరవ ప్రదమైన జీవితం అందించడానికి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. నిష్ణాతులతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేశామని మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు.

# అధిష్ఠానం ఆదేశిస్తే అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం!

### కూడేరు మండలంలో 14 సర్పంచ్, 11 ఎంపీటీసీ స్థానాలపై బీజేపీ దృష్టి

**బీజేపీ మండల అధ్యక్షుడు బి. గోపాల్**



కూడేరు ప్రజావాణి అక్టోబర్ 17 పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే కూడేరు మండలంలోని అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులతో కలిసి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ మండల అధ్యక్షుడు బి. గోపాల్ స్పష్టం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కూడేరు మండలంలో 14 సర్పంచ్ స్థానాలు, 11 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, ఈ స్థానాల్లో పోటీ చేసే విషయంపై పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని తెలిపారు.

పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంస్థాగత బలోపేతానికి కృషి చేస్తామని బి. గోపాల్ వెల్లడించారు. అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతామని ఆయన స్పష్టం చేశారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com